

లఘుచిత్రం షూటింగ్ ప్రారంభం



చిత్రాన్ని ప్రారంభిస్తున్న మాజీమున్సిపల్ చైర్మన్ దస్తగిర్

కాగజ్‌నగర్, జూన్ 28: కాగజ్‌నగర్ పట్టణంలోని త్రినేత్ర ఆలయంలో శుక్రవారం 'విలువ' అనే లఘు చిత్రాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే విలువ అనే లఘు చిత్రాన్ని అంతా వీక్షించాలని కోరారు. కార్యక్రమంలో నిర్మాత ఆర్ఎస్ నాగార్జున, దర్శకుడు రితేష్, నటులు ఈర్ల సునీల్, వరుణ్, అరుణ్, కార్తీక్, గణేష్, నాగర్జున, నవీన్, పప్పి, పాల్గొన్నారు.

నేడు ఉచిత బస్‌పాస్ మేళా

సిర్పూర్(టి), జూన్ 28: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులకు ఉచిత ఆర్టీసీ బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1న ఉచిత వైద్యశిబిరం

కౌటాల, జూన్ 28: డాక్టర్స్ డే సందర్భంగా జూలై 1న మండల కేంద్రంలోని విజేత హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈశిబిరంలో డాక్టర్ అరుణ్‌కుమార్ (డీఎన్‌బి జనరల్ మెడిసిన్), డాక్టర్ రఘుప్రసాద్(జనరల్ ఫిజీషియన్) హాజరు కానున్నారని అన్నారు. ఈశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1న వారసంత వేలం

చింతలమానేపల్లి, జులై 28: చింతలమానేపల్లి మండలంలో నిర్వహించే వారసంతకు జూలై1న ఎంపీడీవో ప్రసాద్ అధ్యక్షతన వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఆసిఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల కాంట్రాక్టర్‌లు ధరావత్తు రూ.20 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

3న ఉచిత బస్‌పాస్ మేళా

చింతలమానేపల్లి, జూన్ 28: చింతలమానేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జూలై 3న దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం విశ్వనాథ్, ఎంపీడీవో ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దహెగాంలో అంధకారం

దహెగాం, జూన్ 28: గురువారం సాయంత్రం గాలివాన రావడంతో విద్యుత్‌సరఫరాలో అంతరాయం చోటుచేసుకుంది. అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం 9వరకు విద్యుత్‌సరఫరా పూర్తిగా నిలిచి పోవడంతో మండలవ్యాప్తంగా అంధకారం నెలకొంది. ఉక్కపోతతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పూర్తయిన వేలం పాట

కౌటాల, జూన్ 28: కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వారసంత, పశువుల సంతకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో పశువుల సంతను రూ.11లక్షలకు నేర్పల్లి అర్జున్, కూరగాయల వారసంతను రూ.42లక్షలకు ఆత్రం ఉమేష్ దక్కించుకున్నారు.

పాఠశాలల ఆడిట్‌ను వాయిదా వేయాలి

ఆసిఫాబాద్, జూన్ 28: జూలై మొదటి వారంలో నిర్వహిం చనున్న పాఠశాలల ఆడిట్‌ను వాయిదా వేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నడుస్తున్నం దున ఆడిట్‌ను వాయిదావేసి ఆగస్టులో నిర్వహించాలని కోరారు.

పంటల వివరాల నమోదు

పెంచికలపేట/చింతలమానేపల్లి, జూన్ 28: పెంచికలపేట మండలంలోని కొండపల్లి, చింతల మానేపల్లి మండలం కర్జవెల్లి గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను శుక్రవారం ఏఈఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పంట వివరాలు నమోదు చేసి ఉంటే సొసైటీలో రైతులు తమ పంటను అమ్ముకోవ డానికి వీలు ఉంటుందన్నారు. రైతులందరూ వేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

గుట్కా దందాపై పోలీసుల ఉక్కుపాదం

మహారాష్ట్ర కేంద్రంగా సాగుతున్న వ్యాపారం



కాగజ్‌నగర్‌లో స్వాధీనం చేసుకున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లు(ఫైల్)

కాగజ్‌నగర్, జూన్ 28: రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు గుట్కాదందాపై ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో మహారాష్ట్ర కేంద్రంగా ఈ దందా జోరుగా సాగుతోంది. ఇన్నాళ్లు పోలీసుల నిఘా లేకపోవటంతో నిత్యం మహారాష్ట్ర రాష్ట్రం నుంచి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌కు లక్షల విలువ చేసే గుట్కాను డంప్ చేశారు. అర్ధరాత్రే భారీస్థాయిలో డంప్ చేసి ఉదయం 6 గంటలకల్లా అన్ని కిళ్లీ కొట్టులకు వీటిని చేరవేస్తున్నారు. దీంతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. గుట్కా తింటే క్యాన్సర్ వస్తుందని తెలిసిన కూడా యువత లెక్కచేయకుండా తింటున్నారు. జిల్లాలో క్యాన్సర్ సోకిన వారిలో ఎక్కువ శాతం గుట్కా బాధితులేనని వైద్యులు చెబుతున్నారు.

యథేచ్ఛగా అమ్మకాలు..

ప్రభుత్వం గుట్కా ఉత్పత్తులను నిషేధించటంతో ఇదే అదనుగా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా అలవాటు పడిన వారు వ్యసనాన్ని మానుకోలేక ఎంతకైనా కొనుక్కొని తింటున్నారు.ఈ గుట్కా దందాలో కూడా పాతవారే చక్రం తిప్పి నడిపించేందుకు మార్గాలు వెతుకుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఈనెల26న ఆసిఫాబాద్‌లోని గోడౌన్‌లో రూ.8లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను పట్టుకొని కేసు నమోదు చేశారు. చింతల మానేపల్లిలో రూ.4వేలు, వాంకిడి మండల కేంద్రంలో రూ.12వేలు విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఈనెల 27న కాగజ్‌నగర్‌లోని గోడౌన్‌లో రూ.2.60లక్షల విలువైన గుట్కాను పట్టుకున్నారు. పక్కాసమాచారంతో దాడులు నిర్వహిస్తుండటంతో అక్రమార్కులు వెనుకంజ వేస్తున్నారు. అమ్మకాలు చేయటం, కేసుల్లో ఇరుక్కోవటం ఎందకని కొంతమంది మానేస్తున్నారు. మరి కొందరు మాత్రం అధిక ధరకు అమ్మి అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. గుట్కా అమ్మకాల్లో కూడా నకిలీ అమ్ముతున్నారు.

పక్కాగా కేసులు నమోదు చేస్తాం..
డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్

గుట్కా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇందులో ఎవరినీ ఉపేక్షించేది లేదు. గుట్కా తినటం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. యువత గుట్కాకు దూరంగా ఉండాలి.



నిషేధిత గుట్కాను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు(ఫైల్)

మంత్రి సీతక్క పర్యటనను విజయవంతం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్, జూన్ 28: ఈనెల30న కాగజ్‌నగర్‌లో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతున్న మంత్రి సీతక్క పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సోషల్‌మీడియాలో వీడియోను పోస్టు చేశారు. కార్యక్రమానికి ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున రావాలని కోరారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

మంత్రి సీతక్క ఈనెల 30న కాగజ్‌నగర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. మిషన్ భగీరథ పనుల ప్రారంభోత్సవం, తదితర కార్యక్రమాలను మంత్రి ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, కమిషనర్ అంజయ్య, ఏఈ అనిల్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు లింగాపూర్‌కు రానున్న మంత్రి సీతక్క

లింగాపూర్: ఈనెల 30న మధ్యాహ్నం 3గంటలకు మండలకేంద్రానికి మంత్రి సీతక్క రానున్నట్లు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు తెలిపారు. మండలకేంద్రంలో నూతనంగా రూ.3కోట్ల30లక్షలతో నిధులతో నిర్మించిన కస్తుర్భాగాంధీ బాలికల విద్యాలయ భవనం ప్రారంభోత్సవానికి రానుండడంతో ఆయన స్థలపరిశీలన చేశారు. వారివెంట ఎస్టీసెల్ జిల్లా చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, జైనూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్‌కే ముఖిద్, మండనాయకులు తదితరులు ఉన్నారు.

ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



వాంకిడిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, జూన్ 28: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 76మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రైతుభరోసా నిధులు విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీపీ విమలాబాయి, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్,తహసీల్దార్ రోహిత్, డీటీ శ్రావణ్, గిర్దావర్ మజీద్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్: జిల్లా ఎస్పీడీవీ శ్రీనివాసరావును శుక్రవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, గాదవేణి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జిల్లా పోలీసు కార్యాలయ విభాగాలను పరిశీలించిన ఎస్పీ



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూన్ 28: జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గల డీసీఆర్బీ (డిస్ట్రిక్ క్రైమ్ రికార్డు బ్యూరో), ఐటీ కోర్, డీపీవో విభాగాల కార్యాలయాలను శుక్రవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఆ విభాగాల్లోగల వివిధ రికార్డులను పరిశీలించారు. ప్రతి రికార్డు అప్ టు డేట్ ఉండాలని తెలియజేశారు. కొన్ని రికార్డులు అప్ టు డేట్ లేనందుకు గల కారణాలను అడిగి తెలుసుకుని వాటిని వీలైనంత త్వరగా అప్‌డేట్ చేయాలని తెలిపారు. అదేవిధంగా పోలీసు అధికారులు, సిబ్బందికి సంబంధించి అన్ని సర్వీసు బుక్కులను, అన్ని రకాల రిజిస్టర్స్‌ని పరిశీలించారు. ప్రతిదీ ఆన్‌లైన్‌లో అప్ టు డేట్ ఉండాలని తెలియజేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్, ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు. భరోసా సెంటర్ ద్వారా ఇప్పటి వరకు రిజిస్టర్ అయిన కేసులు, సహాయం పొందిన మహిళలు, బాలికల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో మోటార్ ట్రాన్స్‌పోర్టు, ఆర్ఐ ఆఫీసర్, ఏఆర్ అడ్మిన్, ఆర్ఐ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. బోల్ ఆఫ్ ఆమ్స్‌లో గల వివిధ ఆయుధాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాల న్నారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనవెంట ఏఎస్పీ ప్రభాకర్‌రావు, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ సీఐ రమేష్, అడ్మిన్ ఆర్ఐ పెద్దయ్య, ఎంటిఆర్ఐ అంజన్న, భరత్‌భూషన్, ఏవో శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆసిఫాబాద్, జూన్ 28: జిల్లాలోని ప్రిమెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టల్ వర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్‌కు ఐఎఫ్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. అయిదునెలలుగా వాచ్‌మెన్, కుక్, కామాటీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తిరుపతి, సత్యశ్రీ, లత, కవిత, సలీం, సంగీత తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

పెంచికలపేట, జూన్28: మండలంలోని చెడ్వాయి గ్రామంలో శుక్రవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి 10లీటర్ల నాటుసారాను స్వాధీనపర్చుకున్నారు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వకుంటే బడులకు తాళాలే

● మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి



డీఈవోతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 28: జిల్లాలో మన ఊరు మన బడికి సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇవ్వకుంటే పనులు చేసిన పాఠశాలలకు తాళాలు వేయాల్సి ఉంటుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ,వైద్య, నీటిపారుదల, విద్య, ఐసీడీ ఎస్, వెటర్నరీ, ఈజీఎస్, ఐకేపీ శాఖల మండల స్థాయి అధికారులు తమ అభివృద్ధి నివేదికలను ప్రవేశపెట్టారు. విద్యాశాఖ నివేదిక సందర్భంలో మనఊరు మనబడి పెండింగ్ నిధులపై చర్చ జరిగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనఊరు మనబడి నిధులు పెండింగ్ ఉండగా ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పనులు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు ఇవ్వకుంటే కాంట్రాక్టర్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పెండింగ్ నిధులు మంజూరు చేయకుంటే పాఠశాలలకు తాళాలు వేయడంతోపాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డీఈవో అశోక్‌తో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ నిధులకు సంబంధించిన నివేదిక పంపించి డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి చెల్లించాలని ఆదేశించారు. జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అయిదు సంవత్సరాల పరిపాలనలో సాధ్యమైనంత అభివృద్ధి చేశామనితెలిపారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ మండలఅభివృద్ధికి ప్రతిఒక్కరు పాటుపడాలన్నారు. సింగిల్‌విండోచైర్మన్ అలీబీన్‌అహ్మద్ మాట్లాడుతూ స్థానికసంస్థల అభివృద్ధి పదిసంవత్సరాల్లో ఎనలేనంతగా జరిగిందన్నారు. అనంతరం చివరి సమా వేశం కావడంతో ఎంపీపీ, జడ్పీటీసీలతోపాటు ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ ఉపసంచాలకురాలు ఆర్ రమాదేవి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 28: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని గిరిజనసంక్షేమ ఉపసంచాకురాలు ఆర్ రమాదేవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనలో సబ్జెక్టు టీచర్లు కీలకపాత్ర పోషించారని అభినందించారు. ఈ ఏడాది ఇప్పటినుంచే ప్రణాళిక ప్రకారం పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. రానున్న పదవతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లీష్‌మీడియంలో పరీక్ష రాయాల్సి ఉందని, అందుకు సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, కోర్సు డైరెక్టర్ కృష్ణారావు, డీఆర్‌పీ వామన్‌రావు, టీచర్లు పాల్గొన్నారు.

'సర్కారు బడికి పోయి చదువుకుంటనే' పాట సీడీ ఆవిష్కరణ

సిర్పూర్(టి), జూన్ 28: మండలంలోని వెంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో చదువుకుంటున్న పంబాల ఇందు పాడిన 'సర్కారు బడికి పోయి చదువుకుంటనే' పాట సీడీని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఇందు పాడిన పాట అద్భుతమని, భవిష్యత్‌లో ఇంకా ఎన్నో ఉన్నతశిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థి ఇందును అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే హరీష్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థిని ఇందు

మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత

శ్రీరాంపూర్, జూన్ 28: ఆర్కే6గనికి చెందిన జనరల్ మజ్దూర్ కార్మికుడు విలాసాగరపు శ్రీనివాస్ తేది: 27-12-2023న మరణించినందున ఆయన కుటుంబానికి మంజూరైన మ్యాచింగ్ గ్రాంట్ చెక్కును అధికారులు శుక్రవారం అందించారు. మృతుడి భార్య శ్రీలతకు గని మేనేజర్ ఈ తిరుపతి రూ. 15,24,200ల చెక్కు అందజేశారు. అనంతరం మేనేజర్ తిరుపతి మాట్లాడుతూ, మ్యాచింగ్ గ్రాంట్ డబ్బులో రూ.7,50,000లు వారి కుమారుడి పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవాలని, మిగిలిన డబ్బును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సంగం సదానందం, ఉప ప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, సిబ్బంది సంతోష్ కుమార్, గణపతి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి సాధనకు ఉద్యోగులు కృషి చేయాలి

జైపూర్, జూన్ 28: బొగ్గు ఉత్పత్తి సాధనకు ఉద్యోగులు కృషిచేయాలని గనిప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఇందారం ఓసీపీలో నూతన ఎస్‌డీఎల్ ఎస్23 యంత్రాన్ని ప్రారంభించి అండర్ గ్రౌండ్‌లోకి దించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో వార్షిక ఉత్పత్తి సాధించడంలో ప్రతి ఒక్కరి కృషి అవసరమన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీర్ రమేష్, ఎస్‌వోఎం రవికుమార్, గని మేనేజర్ నాగన్న, ఇంజనీర్ మల్లేష్, అండర్ మేనేజర్లు పాల్గొన్నారు.



బొగ్గు గనుల వేలం ఆపాలి: సీపీఎం

శ్రీరాంపూర్, జూన్ 28: సింగరేణికిచెందిన బొగ్గుగనుల వేలం ఆపాలని సీపీఎం మండలకార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీసీసీ కార్నర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలో ఉన్న శ్రావణపల్లి గనిని కేంద్ర ప్రభుత్వం వేలం వేయడం సరికాదన్నారు. సింగరేణి ఎంతో డబ్బు ఖర్చుపెట్టి మైనింగ్‌చేస్తే ఆగనిని వేలంలో పెట్టారని ఆరోపించారు. దీని వల్ల ప్రైవేటు వ్యక్తులు ఆగనిని అప్పనంగా పొందే అవకాశం ఉందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించేదిలేదని చెప్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి వేలంను ప్రారంభించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు అడ్డుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గంగాధరచారి, డి రాములు, పి రాములు, కిషన్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం

జైపూర్, జూన్ 28 : జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంట్ జనరల్‌మేనేజర్ బసివిరెడ్డి శుక్రవారం పదవీవిరమణ పొందిన సందర్భంగా భారతీయమజ్దూర్‌సంఘ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ దుస్స భాస్కర్,వైస్‌ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సతీష్, శివకృష్ణ పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ పోస్టుల పెంపు

శ్రీరాంపూర్, జూన్ 28: సింగరేణిలో అంతర్గత అభ్యర్థులతో భర్తీచేయనున్న ఈపీ ఆపరేటర్ ట్రైనీ (కేటగిరీ-5) పోస్టులను మణుగూరు ఏరియాలో 60 నుంచి 100కుపెంచినట్లు జీఎం(సెక్యూరిటీ), జీఎం (పర్సనల్, వెల్ఫేర్, ఆర్‌సి)(ఎఫ్ఎసి) బిఆర్ దీక్షితులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల18నుంచి 21వరకు డ్రైవింగ్‌టెస్ట్ నిర్వహించగా, 828మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరందరికి ఈనెల30న కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రాతపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి అసైన్‌మెంట్, డ్రైవింగ్‌టెస్ట్ మార్కులు కలిపి ఫైనల్ మార్కుల జాబితా తయారుచేసి ప్రధానకార్యాలయంలోని నోటీస్‌బోర్డులో ఉంచుతామని పేర్కొన్నారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, స్థానిక రిజర్వేషన్‌ను అనుసరించి ఖాళీలనుభర్తీ చేస్తామన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలు పూర్తిగా కంప్యూటర్ ద్వారా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు. కొద్దిమంది సృష్టించే పుకార్లను విశ్వసించవద్దని, దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.

బొగ్గుబావుల వేలాన్ని వ్యతిరేకిస్తున్న కార్మికసంఘాలు

మందమర్రి టౌన్, జూన్ 28: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బొగ్గు బావుల వేలం పాటలను సింగరేణిలో కార్మికులు, కార్మికసంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి ప్రధాన ఆర్థిక వనరు అయిన నూతన బొగ్గుబ్లాకులను సింగరేణికే కేటాయించాలనే ఏకైక డిమాండ్‌తో వచ్చేనెల9న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గోదావరిఖని చౌరస్తాలో ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు సమాచారం.

నాణ్యమైన పనిముట్లు అందించాలి

శ్రీరాంపూర్, జూన్ 28: కార్మికులకు నాణ్యమైన పనిముట్లు అందించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. ఆర్కే న్యూటెక్ గనిని యూనియన్ నాయకులు శుక్రవారం సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. పనిముట్లు సక్రమంగా సరఫరా కాకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్‌డీఎల్ యంత్రాల్లో నాణ్యమైన ఆయిల్ వాడనందున మొరాయిస్తున్నాయని, ఆపరేటర్లు కష్టాల పాలవుతున్నారని తెలిపారు. అనంతరం గని మేనేజర్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ సంపత్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. రైతన్న హర్షం

జైనూర్/సిర్పూర్(యు), జూన్ 28: లింగాపూర్, జైనూర్, సిర్పూర్(యు) మండలాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం విత్తనాలు వేసి వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. శుక్రవారం ఏకధాటిగా వరుసగా 4గంటల పాటు కురిసిన వర్షంతో రైతులు ఊరట చెందారు. కురిసిన వర్షంతో విత్తనాలు మొలకెత్తుతాయని, మొలకెత్తిన విత్తనాలకు మరింత బలం చేకూరినట్లవుతుందని వారు అటున్నారు.

కెరమెరి: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల పంట పొలాలకు మేలు జరిగిందని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

కొట్టుకుపోయిన పశువులు..

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి సమీపంలోని పెద్దవాగులో శుక్రవారం ఉదయం నీటి ప్రవాహం పెరిగింది. దీంతో అందవెల్లి గ్రామానికి చెందిన పశువులు వాగు దాటుతుండగా నీటి ప్రవాహ తీవ్రతకు కొట్టుకపోయాయి. అనంతరం కొద్ది దూరంలో ఉన్న వంతెన పిల్లర్ల వద్ద ఆగి సురక్షితంగా బయటపడటంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

పాఠశాలకు శుద్ధజల యంత్రం అందజేత



లక్షెట్టిపేటరూరల్, జూన్ 28: లక్షెట్టిపేట మండలం చందారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు లయన్స్‌క్లబ్ గౌతమి ఆధ్వర్యంలో శుక్రవారం శుద్ధజల యంత్రాన్ని అందజేశారు. విద్యార్థులకు మంచినీరు లేక ఇబ్బందులు పడుతుండడంతో అనుమాల వేణు లయన్స్‌క్లబ్ గౌతమి వారికి తెలిపారు. స్పందించి లయన్స్‌క్లబ్ శుద్ధజల యంతాన్ని అందజేసింది. బీమ మల్లేష్, మధుకర్, చంద్రమోహన్‌గౌడ్, రాజమౌళి, అనిల్‌రావు, మాజీ సర్పంచు జయంత్, ప్రధానోపాధ్యాయురాలు కుబ్జాదేవి, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచు రవీందర్‌రావు, పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మందమర్రిరూరల్, జూన్ 28 :పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శుక్రవారం పొన్నారం, వెంకటాపూర్, మామిడిగట్టు గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను చేయించారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ డ్రమ్ములు, కూలర్లు, నీటి తొట్టిల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీరు ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యదర్శులు సంధ్యారాణి, ప్రశాంత్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ అన్నారు. శుక్రవారం వార్డులో దోమల మందు స్ప్రే చేయించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది వ్యాదుల బారినపడే అవకాశం ఉన్నందున దోమల మందు స్ప్రే చేస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వేమనపల్లి, జూన్ 28 : అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఇందుకోసం హరిత ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సెంట్రల్ టీం సభ్యులు వచ్చే అవకాశం ఉన్నందున రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీవో అనిల్‌కుమార్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అజయ్

జన్నారం, జూన్ 28 : ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కాన్ఫిడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పెండెం అజయ్ నియమితులయ్యారు. ఐహెచ్ఆర్‌సీ అధ్యక్షుడు రాజు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాప్రధాన కార్యదర్శి హనుమయ్యలు శుక్రవారం అజయ్‌కు నియామక పత్రం అందించారు.

కొండగటు అంజన్న సన్నిధిలో జ్యేష్టాభిషేకం

● 108 కళాశాలతో ప్రత్యేక పూజలు

మల్యాల, జూన్ 28: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో శుక్రవారం జ్యేష్టాభిషేకం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 108 కళశాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఆలయ స్థానాచార్యులు కపీందర్ ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, రఘు, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొండగట్టుకు పవన్‌కళ్యాణ్

● జనసేనాని పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

మల్యాల, జూన్ 28: ఏపీ డిప్యూటీ సీఎం, జనసేనాని కొనిదెల పవన్‌కళ్యాణ్ శనివారం కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వస్తున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల ఫలితాల్లో ఘనవిజయం సాధించడంతో ఆ విజయం కొండగట్టు ఆంజనేయస్వామి అండ, ఆశీస్సులేనని మొక్కులు చెల్లించుకోవడానికి పవన్ కొండగట్టుకు వస్తున్నట్లు ఆయన అభిమానులు పేర్కొంటున్నారు. గతేడాది జనవరి 24న పవన్ కొండగట్టులో పర్యటించి ఏపీలోఎన్నికల ప్రచారానికి వినియోగించే నూతన వాహనం వారాహికి పూజలు జరిపించారు. అనంతరం ఏపీలో ఆ వాహనంతో ఎన్నికల ప్రచారం చేయడం, అక్కడ పోటీచేసిన 21స్థానాల్లో గెలుపొందడం, ఏపీ డిప్యూటీ సీఎంగా పదవిని అలంకరించడం కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులేనని అందులో భాగంగానే కొండగట్టుకు వస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పార్టీ అధినేతగా రాగ ఈసారి డిప్యూటీ సీఎం హోదాలో అధికారికంగా పర్యటిస్తున్నారు. ఇందుకుగాను దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా 240మంది పోలీసులతో భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే శనివారంపవన్‌కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లను ఆయన చీఫ్ సెక్యూరిటీ అధికారి అర్జున్, జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

ఈ రోడ్డు బాగుపడేదెప్పుడో?

● గుంతలమయంగా సలుగుపల్లి-పెంచికలపేట రోడ్డు
● ప్రయాణం నరకప్రాయం
● పట్టించుకోని అధికారులు



గుంతల రోడ్డుపై వెళ్తున్న బస్సు

బెజ్జూరు, జూన్ 28: నిత్యం ఆ రోడ్డు వాహనాల రద్దీతో బిజీగా ఉంటుంది. అయితే అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు.. గుంతల్లో వర్షపునీరు నిండి ఉండ టంతో వాహనదారులకు కనబడక ఎప్పుడు ఏం జరుగు తుందోనని ప్రయాణికుల్లో ఆందోళన. అయినా ఆరోడ్డు నిర్మాణాన్ని ఎవ్వరూ పట్టించుకోని కారణంగా ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇదీ సలుగుపల్లి- పెంచికలపేట రోడ్డు దుస్థితి. సలుగుపల్లి నుంచి పెంచికలపేట కేవలం 15కి.మీటర్ల దూరం ప్రయాణమే అయినా అడుగడుగునా పెద్దగుంతలు ఏర్పడటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ మార్గంలో 15కి.మీటర్ల దూరానికి గంటకు పైగా సమయం పడుతోంది. అడుగుకో గుంత చొప్పున 300గుంతలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పెద్దపెద్ద గుంతల్లో వర్షపు నీరు నిండటంతో వాహనదారులకు ఏ గుంత ఎక్కడుందో తెలియని పరిస్తితి నెలకొంది. ముఖ్యంగా ఈ మార్గంగుండా బెజ్జూరుకు 20కిపైగా ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై బస్సులు నడపబోం మొర్రో అంటూ డ్రైవర్లు చేతులెత్తేస్తున్నారు. అయినా ప్రభుత్వం ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. 2015లో అప్పటి ప్రభుత్వం ఈ మార్గంలో బీటీ రోడ్డు పనులు చేపట్టారు.

నిధులు మంజూరైనా.. అనుమతులు అడ్డంకి..

సలుగుపల్లి-పెంచికలపేట మద్య రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.10కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఇక్కడ అటవీ ప్రాంతం ఉండటంతో అనుమతులు లేవని అటవీశాఖ అడ్డంకి తెలపడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. పదేళ్ల క్రితం వేసిన రోడ్డంతా ఇప్పుడు పూర్తిగా గుంతలమంగా మారింది. దీంతో ఈరోడ్డుపై ప్రయాణం చేయడం కష్టతరంగా మారిందని వాహనదారులు, ప్రయాణికులు వాపోతు న్నారు. అటవీ అనుమతుల కోసం రెండేళ్ల నుంచి అధి కారుల చుట్టూ తిరుగుతున్నా అనుమతులు రావడం లేదని ఓఅధికారి పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

ఆదరణ తగ్గని చేతి రాయి చక్కి



రాయి చక్కితో శనగలను పప్పుగా తయారు చేస్తున్న ఆదివాసీ మహిళ

జైనూర్, జూన్ 28: జైనూరు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులు పురాతన కాలం నాటి పద్ధతులను ఆచరిస్తూ ఆహార ఉత్పత్తులను తయారు చేస్తూ ఆరోగ్యంగా ఉంటున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో విద్యుత్ సదుపాయం లేకపోవడం, యంత్రాలు అందుబాటులో ఉండకపోవడంతో ఆదివాసులకు రాయి చక్కి చక్కగా ఉప యోగపడుతోంది. ముఖ్యంగా గ్రామాల్లో పత్రి ఇంట్లో రాయి చక్కి దర్శమిస్తుంది. రాయి చక్కిలో నుంచి వచ్చిన పిండితో తయారు చేసిన రొట్టెలు తినడానికి బాగా రుచికరంగా ఉంటాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. రాయి చక్కి ద్వారా శనగ, కంది, మినుము తదితరాలను విసిరి పప్పులను తయారు చేస్తుంటారు. పిండి కావాలంటే ఆయా పప్పులను, లేదా గింజలను చెక్కిలో వేసి పడతారు. ఇలా చెక్కి ద్వారా వచ్చిన పిండితో చేసిన రొట్టెలు రుచిగా ఉంటాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

● రుచికరంగా ఉంటాయి..

- రేణుకాబాయి..

చేతి రాయి చక్కి నుంచి వచ్చిన పప్పులు, పిండితో ఈయారు చేసిన వంటలు చాలా రుచికరంగా ఉంటాయి. రాయి చక్కినే వాడు కుంటున్నాం. ఇది మాకు పాత కాలం నుంచే అలవాటు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం


కాలిపోయిన బీరువా, దుస్తులు

నస్పూర్, జూన్ 28: సీసీసీ ప్రశాంత్‌నగర్‌కు చెందిన గంగిపెల్లి సురేష్ ఇంట్లో గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రితోపాటు 20 వేల రూపాయలు కాలిపోయాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు వ్యాప్తి చెంది గదిలో ఉన్న బీరువా, టీవీ, ఫ్రిడ్జ్, దుస్తులు, నిత్యావసర సరకులు, నగదు బూడిదయ్యాయి. కాలనీలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ ఇంటిలో నుంచి పొగ రావడం గమనించి ఇంటి యజమాని బంధువులకు సమాచారం ఇచ్చాడు. చుట్టుపక్కల వారు తలుపులు పగులగొట్టి నీళ్ళు చల్లారు. మంచిర్యాల ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.లక్ష 25 వేల ఆస్తి నష్టం జరిగినట్లు మంచిర్యాల ఫైర్ ఆఫీసర్ దేవేందర్ శుక్రవారం తెలిపారు.

మహిళల భద్రతే పోలీసుల లక్ష్యం


మాట్లాడుతున్న సీఐ

నెన్నెల, జూన్ 28: మహిళల భద్రతకు పోలీసులు నిరంతరంగా పని చేస్తారని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. విద్యార్థులు, మహిళలకు ఎలాంటి సమస్యలున్నా ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం మహిళల భద్రత, సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. ఎవరైన వేధిస్తే 100, 1098 నంబర్లకు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. రక్షణ చట్టాల గూర్చి వివరించారు. ఎస్సై ప్రసాద్, హెచ్‌సీ సత్యం, పాఠశాల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

భీమిని, జూన్ 28: మండలంలోని వెంకటాపూర్ గ్రామ పరిధి మారాయిపల్లి గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాద బాధితుడు సుధాకర్‌కు దాతలు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆకుతోట రాజయ్య, వీగాం ఎంపీటీసీ కర్ని మమత, చదువుల నగేష్ ఒక్కొక్కరు ఐదు వేల చొప్పున, 50 కిలోల బియ్యం అంజేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.

క్రీడా పాఠశాలలో చేరికకు పోటీలు


సెలక్షన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఏసీసీ, జూన్ 28: జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం వివిధ మండలాల నుంచి హాజరైన 34 మంది విద్యార్థులకు పోటీలను శుక్రవారం జెడ్పీ బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించారు. డీవైఎస్‌వో కీర్తిరాజ్, ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ఎంఈవో పోచయ్య, హెచ్‌ఎం సుధా రాణి, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ రాంచందర్, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. 8 మండలాల నుంచి ఏడుగురు బాలికలు, 27 మంది బాలురు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాజయ్య, పరిమళ, రవి, యాకూబ్, గోపాల్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ ఫలితాల్లో 75.39 శాతం ఉత్తీర్ణత

ఏసీసీ, జూన్ 28: పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో మంచిర్యాల జిల్లాలో 75.39 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఈవో యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్‌లో నిర్వహించిన ఈ పరీక్షల్లో జిల్లాలో 841 మంది పరీక్షలు రాయగా 634 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. 502 మంది బాలురకు గాను 375 మంది ఉత్తీర్ణత సాధించగా 339 మంది బాలికలకు 259 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రీకౌంటింగ్ కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చొప్పున జూలై 8లోగా ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా చెల్లించి హైద్రాబాద్ కార్యాలయానికి నేరుగా కానీ, పోస్టు ద్వారా కానీ పంపించాలన్నారు. జవాబు పత్రాల కోసం దరఖాస్తులను ప్రధానోపాధ్యాయులతో సంతకం చేయించి హాల్‌టికెట్ జిరాక్స్, ఆన్‌లైన్ మెమో కాపీతో డీఈవో కార్యాలయంలో అందించాలన్నారు.

పాఠశాలను పరిశీలించిన డీఆర్‌డీవో


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

భీమారం, జూన్ 28: మండల కేంద్రంలోని పోతనపల్లి గ్రామ పంచాయతీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం డీఆర్‌డీవో కిషన్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలమృతం, గుడ్లు, అన్నం బాలింతలకు అందించాలన్నారు. త్వరలో ప్రారంభమయ్యే హరితహారం కోసం నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి మొక్కలను సంరక్షించాలని సూచించారు. వర్షాకాలంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలన్నారు. ఎంపీడీవో రాథోడ్ రాధ పాల్గొన్నారు.

ఆదివాసీ ఆధ్వర్యంలో బడిబాట

మందమర్రిరూరల్(కాసిపేట), జూన్ 28: మండల ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం గట్రావుపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివాసీల వద్దకు వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజం నేటికి వెనకబడిపోవడానికి కారణం చదువు లేకపోవడమేనని తెలిపారు.ప్రతి ఆదివాసీలు వారి పిల్లలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. కాలేజీ మధ్యలో ఆపేసిన విద్యార్థులను కాలేజీకి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, కిషన్, హన్మంతు, జంగు, భూమయ్య, తిరుపతి, గణపతి, జైతు, తదితరులు పాల్గొన్నారు.

బోడ కాకరకాయ కేజీ రూ.600



మంచిర్యాల అర్బన్, జూన్ 28: వర్షాకాలంలోనే లభించే బోడ కాకరకాయ ధర ప్రజలను బెంబేలెత్తిస్తోంది. శుక్రవారం మంచిర్యాల మార్కెట్‌లో కేజీకి రూ.600 పలికింది. మార్కెట్‌కు వచ్చిన ప్రజలు ధరను చూసి కొందరు కొనకుండానే వెనుదిరగగా, మరి కొందరు మటన్ ధరతో పోల్చితే తక్కువే ఉందని కొనుగోలు చేశారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఏసీసీ, జూన్ 28 : అడ్డగోలు ఫీజులతో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు చేపట్టాలని జాతీయ విద్యార్థి సమాఖ్య నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా కార్పొరేట్ పాఠశాలల దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కి అధిక ఫీజులతో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయన్నారు. స్టేషనరీ, పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతూ విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు చేరాల వంశీ, సురేష్, బాలాజీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ నర్సింహరావుకు నివాళి

మందమర్రి టౌన్, జూన్ 28: దేశ మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు జయంతి పురస్కరించుకుని శుక్రవారం ఢిల్లీలో ఆయన చిత్రపటానికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఎంపీ మల్లు రవిలు ఉన్నారు. ఎంపీ మాట్లాడుతూ దేశ ప్రగతికి పీవీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయనతో పాటు జేవీరెడ్డి, కిరణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పీవీ నర్సింహరావు జయంతిని కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మందమర్రిలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు ఉపేందర్‌గౌడ్, సుదర్శన్‌లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి, దేశ ప్రగతికి పాటు పడిన వ్యక్తి పీవీ అని తెలిపారు. పుల్లూరి లక్ష్మణ్, నెర్వెట్ల శ్రీనివాస్, గుడ్ల రమేష్, ఎండి జమీల్, రాజు, సునీల్, పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు జయంతిని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. గోపతి రాజయ్య, శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, సుధాకర్, పలిగిరికనకరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెరువు శిఖం కాపాడాలి

జన్నారం, జూన్ 28 : రేండ్లగూడ శివారులో ఉన్న చెరువు శిఖం భూమిని కాపాడాలని శుక్రవారం గ్రామస్థులు డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 ఎకరాల చెరువు శిఖం భూమిని అన్యాయంగా ఆక్రమించుకుని పొలాలు చేసుకుంటూ కొందరు అనుభవిస్తున్నారన్నారు. ఈ భూమిలో బావులు తోడి విద్యుత్‌తో నీటిని తోడుతున్నారని దీంతో పశువులకు తాగడానికి నీరు కరువైందన్నారు. రైతుల భూములకు కూడా నీరందడం లేదన్నారు. వెంటనే చెరువు శిఖం భూమిని కాపాడాలని కోరారు.

లేబర్ కాంట్రాక్టు కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

చెన్నూరు, జూన్ 28 : చెన్నూరు లేబర్ కాంట్రాక్టు కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పాలక మండలి ఎన్నికల కార్యాచరణ ఖరారైనట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 మంది సభ్యులకుగాను సంఘం కార్యాలయంలో జూలై 1 నుంచి 3 వరకు నామినేషన్‌ల స్వీకరణ, 4న నామినేషన్‌ల పరిశీలన, 5న ఉపసంహరణ, 9న అధికంగా నామినేషన్‌లు దాఖలైతే 10న రహస్య బ్యాలెట్ ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

సీడ్ డ్రిల్‌తో వరి విత్తనాలు వేయవచ్చు

జన్నారం, జూన్ 28 : రైతులు ఆయిల్‌పామ్ సాగులో సీడ్ డ్రిల్ పరికరం సహాయంతో వరి విత్తనాలు వేయవచ్చని మండల వ్యవసాయాధికారి సంగీత అన్నారు. శుక్రవారం రేండ్లగూడ రైతు సీడ్ డ్రిల్ పరికరంతో వేస్తున్న విత్తనాల ప్రక్రియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రేండ్లగూడలో 8 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న అల్లం లచ్చన్న సీడ్ డ్రిల్ పరికరంతో వ్యవసాయం చేసి ఎకరానికి 25 క్వింటాళ్ల ధాన్యం పండించాడని తెలిపారు. ఏఈవో త్రిసంధ్య, రైతులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

చెరువు కాలువ పూడిక తీత చేపట్టాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి, జూన్ 28: తాండూర్ మండలంలోని పెద్ద చెరువు కాలువ పూడిక తీత పనులు చేపట్టాలని, చెట్ల పొదలను తొలగించాలని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. చెరువు కాలువ పూడికతీత తీయకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పూడిక తీత పనులను చేపట్టాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎండీఈసా, ఎంపీటీసీ శంకర్, మదర్‌ఖాన్, హర్షత్, రైతులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్

మంచిర్యాల అర్బన్, జూన్ 28: రామగుండం కమిషనరేట్ పరిధిలో మూడు నెలల కాలంలో మహిళలు, విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తూ షీటీమ్స్‌కు పట్టుబడిన 42 మంది ఆకతాయిలకు శుక్రవారం కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్ మహిళ భద్రతా విభాగం (ఉమెన్ సేఫ్టీ వింగ్) నిపుణులచే కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళలను ఎలా గౌరవించాలి, వారి పట్ల ప్రవర్తించాల్సిన తీరు, అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం ఎలాంటి శిక్షలు పడుతాయనే అంశాలపై అవగాహన కల్పించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి, మహిళ పోలీస్ స్టేషన్ సీఐ రాజమౌళి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 49మిల్లీమీటర్ల వర్షపాతం

ఆసిఫాబాద్, జూన్ 28: జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 49మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాతోపాటు ఎగు వన కురిసిన వర్షానికి పెద్దవాగుకు వరద ఉధృతి పెరిగింది. జిల్లాలో అత్యధికంగా వాంకిడి మండలంలో 97.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా కాగజ్‌నగర్ మండలంలో 11మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. జైనూరులో 26.6మిల్లీమీటర్లు, సిర్పూర్(యు)లో 35.4 మిల్లీమీటర్లు, లింగాపూర్‌లో 68.2మిల్లీమీటర్లు, తిర్యాణిలో 37.4 మిల్లీమీటర్లు, రెబ్బెనలో 13మిల్లీమీటర్లు, ఆసిఫాబాద్‌లో 55.8 మిల్లీమీటర్లు, కెరమెరిలో 80.4మిల్లీమీటర్లు, వాంకిడిలో 97.6 మిల్లీమీటర్లు, కాగజ్‌నగర్‌లో 11మిల్లీమీటర్లు, సిర్పూర్(టి)లో 71.2మిల్లీమీటర్లు, కౌటాలలో 39.8మిల్లీమీటర్లు, చింతలమానే పల్లిలో 79.6మిల్లీమీటర్లు, బెజ్జూరులో 44.4 మిల్లీమీటర్లు, పెంచికలపేటలో 34.2మిల్లీమీటర్లు, దహెగాంలో 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

అందుబాటులో ఎరువులు

జైనూర్, జూన్ 28: కొద్ది రోజుల నుంచి రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్న తరుణంలో శుక్రవారం స్థానిక మార్కెట్ కమిటీ గోందాంకు ఎరువులు వచ్చాయి. ఎరువుల లారీ గోదాంకు చేరుకోగానే రైతులు గోదాం వైపు పరుగులు తీశారు. ఈ సందర్భంగా 400బ్యాగుల ఎరువులు వచ్చాయని సీఈవో సోనకాంబ్లే జనార్దన్ తెలిపారు. ప్రైవేట్ సహకార కేంద్రం ఆధీనంలో కొనసాగుతున్న దుకాణంలో 10నుంచి 20 రుపాయలు తక్కువ ధర ఉండటంతో రైతులు మార్కెట్ గోదాంలోనే ఎరువుల కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కాగా జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల రైతులు జైనూర్‌కు మార్కెట్‌పరంగా రాకపోకలు చేస్తూ ఇక్కడే ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో జైనూరు మండల రైతులకు ఎరువుల కొరత ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి జైనూరు మండలానికి అధిక మొత్తంలో ఎరువులు సప్లయి చేయాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్మణ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

జైనూర్, జూన్ 28: మండల కేంద్రంలో మాజీసర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేస్రాం లక్ష్మణ్ గుండె పోటుతో మరణించడంతో సిర్పూర్(యు) జడ్పీటీసీ కోవ అరుణ, గ్రంథాలయ మాజీచైర్మన్ కనక యాదవ్‌రావ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్‌లో చురుకైన నాయకుడిని కోల్పోయామని కోవ అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీపరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

మ్యూజియం సందర్శనతో విజ్ఞానం పెరుగుతుంది

● ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఆసిఫాబాద్, జూన్ 28: జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 50మంది హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంను సందర్శించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా మాట్లాడుతూ మ్యూజియం సందర్శనతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని అన్నారు. విద్యార్థులకు ఇలాంటి పర్యటనలు విద్యారంగంలో మరింత రాణించేందుకు దోహదపడుతాయని తెలిపారు.


సాలార్ జంగ్ మ్యూజియం వద్ద విద్యార్థులు

భారీగా ఇసుక నిలువలు స్వాధీనం


ఇసుక నిలువల వద్ద మైనింగ్ అధికారులు

పెంచికలపేట, జూన్ 28: మండల కేంద్రంలోని ఎల్కపల్లి గ్రామంలో శుక్రవారం జిల్లా మైనింగ్ ఏడీ గంగాధర్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక నిలువలపై దాడులు నిర్వహించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పెద్దవాగు నుంచి అక్రమంగా తరలించి వివిధ ప్రాంతాల్లో పెద్దఎత్తున ఇసుకను నిలువ చేశారన్న సమాచారం మేరకు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో బ్రిక్స్ నిర్వహిస్తున్న వేముల మోహన్, మిట్ట రమేష్, సముద్రాల సత్యనారాయణ, రావుల సంతోష్‌తోపాటు ట్రాక్టర్‌యజమాని రమేష్ అక్రమంగా నిలువఉంచిన 235ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇసుక విలువ రూ.3,29,000 ఉంటుందని పేర్కొన్నారు. వారంరోజుల లోపు రశీదుకు సరిపడ డబ్బులు చెల్లించి సదరు వ్యక్తులు ఇసుకను తీసు కోవచ్చని లేని పక్షంలో రశీదు డబ్బులు చెల్లించకుంటే వేలం వేస్తామని అన్నారు. ఈ దాడుల్లో ఆర్ఐ గోపాల్ ఉన్నారు.

అటువైపు చూడని అధికారులు..

మండలంలో పలుచోట్ల మరికొన్ని ఇసుక నిలువలు కనిపించినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. స్థానికులు సమాచారం అందించినా అధి కారులు అటువైపు చూసీచూడనట్లుగా వదిలి వేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫలితంగా ప్రభుత్వం లక్షల రూపాయల రాయల్టీ కోల్పోనుంది.

గుప్పగూడెంలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


విద్యుత్ తీగలు చేతికందుతాయని చూపుతున్న గ్రామస్థులు

చింతలమానేపల్లి, జూన్ 28: మండలంలోని లంబాడీహెట్టి(గుప్పగూడెం) గ్రామంలో ప్రధానరహదారిపై ఉన్న 11కేవీ విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా మారాయి. పూర్తిగా కిందికి వేలాడుతుండడంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చేయి ఎత్తితే అందే విధంగా ఉండడంతో కనీసం స్కూల్ బస్సు కూడా వచ్చే పరిస్థితి లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే విద్యుత్‌తీగలను సరిచేసి ఎలాంటి అపాయం జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈని సంప్రదించగా త్వరలోనే స్తంభాన్ని ఏర్పాటు చేసి కిందికి ఉన్న వైర్లను సరి చేస్తామన్నారు.

చెత్త కుండీలు ఏర్పాటు చేయాలి

రెబ్బెన, జూన్ 28: మండలంలోని వంకులం, ఎడవెల్లి గ్రామాల్లో డీవైఎఫ్ఐ బృందం యువజన సభ్యులు శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ప్రధానంగా చెత్త కుండీలు లేకపోవటంతో ప్రజలు అవస్థలు పడుతున్నట్టు తేలింది. అలాగే మురికి కాల్వలు, సీసీరోడ్లు లేకపోవటంతో కూడా ప్రజలు కష్టాలు పాలవుతున్నట్టు డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం తెలిపారు. ఈ సర్వేలో మండల అధ్యక్ష, కార్యదర్శులు జాడిశ్యాం, ఆత్మకూరి సతీష్, మండల ఉపాధ్యక్షుడు చల్లూరి కృష్ణ, యువకులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన భగీరథ నీటి సరఫరా

దహెగాం, జూన్ 28: మండలవ్యాప్తంగా మిషన్ భగీరథ నీటిసరఫరా నిలిచిపోయింది. దహెగాం మండలంలోని 50కిపైగా గ్రామాలు, కాగజ్‌నగర్ మండలంలోని బోడపల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిసరఫరా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతానికి అందవెల్లి పెద్దవాగు వంతెనవద్ద భగీరథ పైపులైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈనిర్మాణపనులు వారంరోజులపాటు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

న్యాయశాస్త్ర పట్టభద్రుల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జూన్ 28: ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2024-25సంవత్సరానికి అర్హులైన షెడ్యూల్ కులాల న్యాయశాస్త్ర పట్టభద్రుల నుంచి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లాషెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ ఒకప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ప్రతినెల మూడువేల రూపాయల భృతిని అందించడంతో పాటు న్యాయశాస్త్ర గ్రంథాలకు, ఇతర ఫర్నీచర్ కొనుగోలుకు రూ.50వేలు మంజూరు చేస్తామని తెలిపారు. 39 సంవత్సరాల లోపు అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బీర్‌శావ్

జైనూర్, జూన్ 28: జైనూరు మండలానికి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బీర్‌శావ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న తిరుపతి సెలవుపై ఉండటంతో ప్రభుత్వం ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీతహసీల్దార్ బీర్‌శావ్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించింది. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు ఇన్‌చార్జీ తహసీల్దార్‌ను సన్మానించారు.

నూతన జాతీయ విద్యావిధానంపై అవగాహన


శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

కౌటాల, జూన్ 28: మండలకేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రెండోరోజు అంగన్‌వాడీ టీచర్లకు నూతన విద్యావిధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జాతీయ విద్యావిధా నంలో భాగంగా పూర్వప్రాథమిక విద్యావిధానాన్ని సరళీకృతంచేస్తూ పొందుపరిచిన విషయాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి, సూపర్ వైజర్లు షకీరాబేగం, కరుణ, పద్మ, శంకరమ్మ, హసీనా బేగం, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి తోడ్పడాలి

బెజ్జూరు, జూన్28: సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్ అన్నారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించనున్నట్లు పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను రైతులకు ఎరువులు అందించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా అరువు పద్దతి లేనందున సంఘం ఖాతా నుంచి రూ.15లక్షలు ఇవ్వడానికి, పోడుసాగు చేసుకుంటున్న రైతులకు సభ్యులుగా చేర్చుకొని రుణాలు ఇచ్చేందుకు తీర్మాణం చేశారు. కార్యక్రమంలో అధికారి వెంకటేశ్వర్‌గౌడ్, సంజీవ్,సత్యనారాయణగౌడ్,డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నర్సింహారావు జయంతి



వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి, జూన్ 28: మండలకేంద్రంలో భారతమాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సుధాకర్, జైరాం, అనీల్, ప్రశాంత్, గణేష్, దాదాజీ, రమేష్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు ఉత్తర్వులు జారీ

సిర్పూర్(యు), జూన్ 28: మండలంలోని ముంజీగూడలో హనుమాన్‌మందిర నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఇటీవల హైదరాబాదులో ఎండోమెంట్ కమిషనర్‌కు ఆదివాసీ నాయకుడు భీంరావ్ వినతిపత్రం సమర్పించడంతో ప్రభుత్వం స్పందించింది. ఈమేరకు హనుమాన్ మందిరనిర్మాణం కోసం సమగ్ర నివేదిక తయారు చేయాలని ఎండోమెంట్ కమిషనర్, కరీంనగర్‌కు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌ను ఉత్తర్వులో ఆదేశించినట్లు సమాచారం. దీంతో త్వరలోనే హనుమాన్ మందిర నిర్మాణం పనులు ప్రారంభమవుతాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్, జూన్ 28: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. జిల్లాలో మొత్తం 1110మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 691 మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించనట్లు జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు తెలిపారు.

పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

వాంకిడి, జూన్ 28: ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో భాగంగా ఖిరిడి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఏగా విదులు నిర్వహిస్తున్న సోయం ఇందురావును శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇందురావు సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు శృతి,తిప్పరెడ్డి, రాజు, గణపతిపాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శనివారం 29 జూన్ 2024



రుణమాఫీపై ఆశలు

- 2023 డిసెంబరు 9 వరకు కటాఫ్
- అప్పటి వరకు తీసుకున్న వారే అర్హులు
- సమాచారం కోసం బ్యాంకర్లకు ఆదేశాలు
- జిల్లాలో 94వేల పై చిలుకు మంది రైతులు



మంచిర్యాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైతుల రుణాలు మాఫీ చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. ఇటీవల కేబినెట్ సమా వేశంలో 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్య కాలంలో తీసుకున్న రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేయ నుంది. ఆగస్టు 15వ తేదీ నుంచి ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయనున్న ట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా బ్యాంకర్ల నుంచి రుణాలు తీసుకున్న రైతుల సమాచారం అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో 94 వేల మంది అర్హులు

ప్రభుత్వ నిర్ణయం మేరకు రుణమాఫీ పథకానికి జిల్లాలో 94వేల పై చిలుకు రైతులు అర్హత ఉన్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా లక్షా 57 వేల మంది రైతులు ఉండగా వివిధ రకాల పంటలు 3.42 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. జిల్లాలో ఉన్న రైతుల్లో 25 వేల వరకు కౌలు రైతులు కూడా ఉన్నారు. ఐదెకరాల పైబడి ఉన్న రైతులకు మాత్రమే బ్యాంకర్లు రూ.2 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. గత వానాకాలం సీజన్ నుంచి రూ.2 లక్షల వరకు పంట రుణం తీసుకున్న వారిలో 94వేల మంది వరకు ఉన్నట్లు బ్యాంకర్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు వీరందరికీ రుణమాఫీ చేయాలంటే రూ.505 కోట్ల వరకు అవసరం ఉంటుంది. యేటా తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసుకుంటూ కొత్త రుణాలు పొందినట్లు బ్యాంకర్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో యేటా వానాకాలం, యాసంగి పంట రుణాల కింద రూ.1600 కోట్ల వరకు బ్యాంకులు ఇస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఇప్పటికే నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేసినట్లు తెలుస్తోంది.

మార్గదర్శకాలతోనే స్పష్టత

రైతులకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల అయితేనే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అర్హులను ముందస్తుగా గుర్తించడం ద్వారా వీలైనంత ఎక్కువ మంది పేద రైతులకు సాయం చేయాలన్న దృక్పథంతో ప్రభుత్వం ఉన్నట్లు కనిపిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఐదేళ్లకాలానికి సంబంధించి రుణమాఫీ చేయనున్నట్లు సమాచారం.

రైతు రుణమాఫీ, లబ్ధిదారుల గణాంకాలపై సమీక్ష జరిపి త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నిధుల కేటా యింపు ఉంటుందని సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. లక్ష లోపు రుణమాఫీ అమలు చేసినప్పుడు కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిం చేలా మార్గదర్శకాలు రూపొం దించింది. దీంతో అర్హతలపై రైతులు ఉత్కంఠకు గురవుతున్నారు. కొందరు రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొంది ప్రభుత్వాలు మాఫీ అనడంతో రెన్యూవల్ చేయించుకో కుండా ఆశతో ఉన్నారు. రుణమాఫీ విషయమై బ్యాంకర్లకు కూడా ఇప్పటి వరకు సరియైన సమాచారం లేకపోవడంతో మార్గదర్శకాల విడు దల కోసం బ్యాంకర్లతోపాటు రైతులు ఎదురు చూస్తున్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

మల్క తిరుపతి, గుడిపేట రైతు



రైతులకు రుణమాఫీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో చాలా ఆనందంగా ఉంది. పంట సాగు కోసం ఇప్పటి వరకు రూ.3 లక్షల రుణం తీసుకున్న. ప్రభుత్వం రెండు లక్షలు మాఫీ చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. వానాకాలం సీజన్‌లో పంట పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అర్హతగల రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

కబ్జాదారుల్లో గుబులు

సర్వే నంబరు 42లో భూ సర్వే ప్రారంభం



కొలతలు తీస్తున్న అధికారులు

నస్పూర్, జూన్ 28: నస్పూర్‌లోని సర్వే నంబరు 42లో భూమి లెక్కను తేల్చడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. దీంతో కబ్జాదారుల్లో గుబులు మొదలైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూ సర్వే, కొలతల శాఖ ఏడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నలుగురు సర్వేయర్లతో ప్రారంభించారు. నస్పూర్ శివారులోని 42 సర్వే నంబరులో 102.10 ఎకరాల భూమి ఉన్నది. ఇందులో ప్రభుత్వ అవసరాలకు, కొందరికి ఇళ్ల స్థలాలు, రైతులకు అసైన్డ్ చేయగా మిగులు భూమి దశల వారీగా అన్యాక్రాంతమైంది. దీనిని తేల్చడానికి అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. నిర్మించిన ఇళ్లతో పాటు ఖాళీ స్థలాలు, రోడ్లు, నిర్మాణాల కొలతలు తీస్తున్నారు. డీఐ గంగాధర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మాంతయ్య, మున్సిపల్ టీపీఎస్ సతీష్, సర్వేయర్లు, రెవెన్యూ, మున్సిపల్ బిల్లు కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే నంబరు 42లో కలెక్టరేట్ నిర్మాణంతో అక్రమార్కుల కన్ను ఈ భూమి పడింది. రెవెన్యూ అధికారులపై రాజకీయ ఒత్తిళ్ళ కారణంగా ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిందనే ఆరోపణలున్నాయి. అసైన్డ్‌దారుడిగా ఉన్న కొందరు గతంలోనే భూమిని మరొకరికి విక్రయించి తిరిగి ఆ కాగితాలనే చూపించి మరో చోట కబ్జాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. కోట్ల విలువైన భూములను దక్కించుకోవడానికి కబ్జాదారులు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. తాజాగా భూమిని కొలతలు తీసి మిగులు భూమితేల్చాలని నిర్ణయించడంతో కబ్జాదారుల్లో ఆందోళన మొదలైంది.

కురిసిన వర్షం.. చల్లబడిన వాతావరణం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 28: జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు కురిసిన భారీ వర్షంతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో నగటున 34.79 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాసిపేట మండలం కొండాపూర్‌లో 72.5మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదు కాగా హాజీపూర్ మండలం ర్యాలీలో 2.05 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షం కురిసింది. నస్పూర్ 66.0 మిల్లీమీటర్లు, జైపూర్ 62.0, బెల్లంపల్లి 51.5, మంచిర్యాల 50.5, కోటపల్లి 50.3, భీమారం, జన్నారం మండలాల్లో 48.0, దండేపల్లి 44.5, భీమిని 42.0, లక్సెట్టిపేట 38.3, నెన్నెల 34.8, చెన్నూరు 34.0, మందమర్రి మండలంలో 31.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

నేడు తాండూర్ వారసంత వేలం

బెల్లంపల్లి(తాండూర్), జూన్ 28: తాండూర్ వారసంతకు శనివారం ఉదయం 11 గంటలకు ఐబీలోని సంత స్థలం వద్ద వేలం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి తపాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలం ధరావత్తు రూ.10 వేలు ఉదయం 11 గంటలలోగా పంచాయతీ కార్యాలయంలో లేదా సిబ్బందికి చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

వేలంపాట వాయిదా

చెన్నూరు, జూన్ 28: చెన్నూరు మార్కెట్‌లో (తైబజార్, పశువులు) సంత వసూలుకు సంబంధించి శుక్రవారం వేలం పాట జరగాల్సి ఉండగా దరఖాస్తులు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 4వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామన్నారు.

అక్రమంగా ఎగ్జిబిషన్ పెట్టారని కలెక్టర్‌కు ఫిర్యాదు

నస్పూర్, జూన్ 28 : నస్పూర్ శివారులోని 42/10లో ఎకరం భూమి వారసత్వంగా వస్తుందని, ఆ భూమిపై కోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఉండగా అక్రమంగా ఎగ్జిబిషన్ పెట్టారని శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు బాధితుడు సుదమల్ల చందు ఫిర్యాదు చేశారు. పక్కనే ఉన్న మరొకరి భూమిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ అనుమతులు తీసుకుని తన భూమిలో ఏర్పాటు చేశారన్నారు. నిర్వాహకులకు ఎన్నిసార్లు చెప్పినా అనుమతి ఉన్నదని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తమకు చెందిన భూమిలో నుంచి ఎగ్జిబిషన్ తొలగించాలని విన్నవించారు. తహసీల్దార్, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ప్రైవేటు ఐటీఐలపై చర్యలు తీసుకోవాలి

ఏసీసీ, జూన్ 28 : అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఐటీఐ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు ఐటీఐలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు ఐటీఐలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌ప్రశాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో వెలిసిన గుడిసెలు

- రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో తొలగింపు
- పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి

దండేపల్లి, జూన్ 28: దండేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం సమీపంలో ఓ రైతుకు చెందిన భూమిలో రాత్రికి రాత్రే గుడిసెలు వెలిసాయి. సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున నిరుపేదలు ఇంటి స్థలాల కోసం తాత్కాలిక గుడిసెలు వేశారు. దండేపల్లికి చెందిన జయగిరి వెంకటరమణకు చెందిన సర్వే నెంబర్ 451, 452లో సుమారు 4.20 ఎకరాల స్థలం ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం కోసం కొంత స్థలాన్ని ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. ఇదే భూమిని గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన కొందరికి ఇనాంగా ఇచ్చారు. కళాశాలకు భూమి విరాళంగా ఇవ్వడంతో 10 గదులను నిర్మించారు. కళాశాల భవనంపై తాత పేరు పెట్టాలని భూదాత సూచించారు. నిబంధన ప్రకారం పేరు పెట్టరాదని అధికారులు నిరాకరించడంతో పట్టాదారు హైకోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తీసుకవచ్చి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. కొందరు నిరుపేదలు సీపీఐ నాయకులతో కలిసి గుడిసెలు ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన వారు గుడిసెలను తొలగించారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తే అవకాశం ఉండడంతో ఎస్సై భూమేష్, లక్సెట్టిపేట, జన్నారం ఎస్సైలు చంద్రకుమార్, రాజవర్ధన్, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి సమస్యను తెలుసుకున్నారు. తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని ఇవ్వాలని నిరుపేదలను సముదాయించారు. గుడిసెలను తొలగించిన అనంతరం తహసీల్దార్ సంధ్యరాణికి సీపీఐ మండల కార్యదర్శి పెర్క రాజేష్‌తో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రాజేష్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం స్థలాలు పంపిణీ చేయాలన్నారు.



దండేపల్లిలో వెలసిన తాత్కాలిక గుడిసెలు, సమస్యను తెలుసుకుంటున్న ఎస్ఐ

జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తేవాలి

ఏసీసీ, జూన్ 28: బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తేవాలని జడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ అన్నారు. శుక్రవారం గ్రీన్ సిటీ మాస్టర్స్ ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోనిక్స్ సన్‌రైజ్ సీనియర్స్ మెన్, వుమెన్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉందని, దేశ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. క్రీడల్లో రాణించే వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు ఉంటాయని, మంచి గుర్తింపు ఉంటుందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య మాట్లాడుతూ మంచిర్యాలలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించే వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో జిల్లా కేంద్రంలో స్టేడియాన్ని రూపొందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాపు మాట్లాడుతూ మంచిర్యాలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారని, క్రీడాకారులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తున్నారని నిర్వహకులను అభినందించారు. మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, టోర్నమెంట్ కన్వీనర్ ముకేష్‌గౌడ్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు వాసు, పుల్లూరి సుధాకర్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, డీవైఎస్‌వో రాజ్‌వీరు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, పూదరి తిరుపతి, అసోసియేషన్ సభ్యులు సత్యపాల్‌రెడ్డి, మీనారెడ్డి, రమేష్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

రేపు ఉచిత వైద్య శిబిరం


భీమిని, జూన్ 28 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈనెల 30 న ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైండ్ మ్యాటర్స్ సీఈఓ బోగె సత్యం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు ఉచిత మానసిక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామన్నారు. మానసిక వైద్య నిపుణులు డా.రవివర్మ, డా.సాయి వారిచే వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దీనిని కన్నెపల్లి, భీమిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

జైపూర్, జూన్ 28: ఇందారం గ్రామంలోని కాసింపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు శుక్రవారం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందించారు. ఇందారంలో కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని, తీగలకు మధ్య సపోర్టుగార్ఫ్ వేయాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న స్తంభాలను మార్చాలని విన్నవించారు. చిప్పకుర్తి కిరణ్,చిప్పకుర్తి సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా శతాధిక వృద్ధుడి జన్మదినం

మంచిర్యాల అర్బన్, జూన్ 28: మంచిర్యాల పట్టణంలోని చింతపండువాడకు చెందిన శతాధిక వృద్ధుడు పుల్లూరి లక్ష్మీనారాయణ గుప్త శుక్రవారం 101వ జన్మదిన వేడుకలను కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణకు ఇద్దరు కుమార్తెలు కాగా, పెద్ద కూతురుకు 70 యేండ్ల పైబడి వయసు ఉంటుందని కుటుంబసభ్యులు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న లక్ష్మీనారాయణ

కాన్కూర్ పాఠశాలను సందర్శించిన ఎంఈవో

జైపూర్, జూన్ 28: మండలంలోని కాన్కూర్ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణ సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ పాఠశాలలో ప్రైవేటు ఉపాధ్యాయుడే లేడని, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇద్దరు సక్రమంగా వస్తున్నారని విచారణలో తల్లిదండ్రులు పేర్కొన్నారని ఎంఈవో తెలిపారు. నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి పంపిస్తానని పేర్కొన్నారు. కాగా రూ.9 వేలు ఇచ్చి విద్యావలంటీర్‌ను నియమించుకున్నామని తల్లిదండ్రులు ఒక ప్రకటన పంపారు. ప్రకటన విషయం తన దృష్టికి రాలేదని, ప్రైవేటు ఉపాధ్యాయుడు లేడని తల్లిదండ్రులు చెప్పారని ఎంఈవో పేర్కొన్నారు.

కన్నాల వద్ద యూటర్న్ తొలగించాలి

బెల్లంపల్లి, జూన్ 28 : బెల్లంపల్లిలోని కన్నాల జాతీయ రహదారిపై ఉన్న యూటర్న్ వల్ల ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయని, యూ టర్న్‌ను తొలగించాలని శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌కు బెల్లంపల్లికి చెందిన అడ్వకేట్ మాదరి రాకేష్ వినతి పత్రం అందించారు. హైవే అధికారులు, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన డీసీపీ

మంచిర్యాల అర్బన్, జూన్ 28: మంచిర్యాల డీసీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎ.భాస్కర్ శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసిపుష్పగుచ్ఛం అందజేశారు.

పోలీస్‌స్టేషన్లను సందర్శించిన డీసీపీ

డీసీపీ భాస్కర్ మంచిర్యాల, హాజీపూర్ పోలీస్‌స్టేషన్లను ఏసీపీ ప్రకాష్‌తో కలిసి సందర్శించారు. అధికారులు, సిబ్బంది వివరాలను, పోలీస్‌స్టేషన్ల బౌగోళిక పరిస్థితులను తెలుసుకొన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేరాలు జరుగుతున్నాయని ఆరా తీశారు. సీఐ బన్సీలాల్ ఉన్నారు.

నస్పూర్: నస్పూర్‌పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ భాస్కర్ సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై రవికుమార్ పాల్గొన్నారు.

హాజీపూర్: పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని డీసీపీ భాస్కర్ సూచించారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. డీసీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చేఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక కృషి చేయాలని, గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. రూరల్ సీఐ అశోక్‌కుమార్, నరేష్‌కుమార్ తదితరులుపాల్గొన్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న డీసీపీ, నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ

భూములు పేదలకు పంచాలి

చెన్నూరు, జూన్ 28: అక్రమ పట్టాలను రద్దు చేసి పేదలకు భూములు పంచాలని సీపీఎం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, వాసు దేవరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం బావురావుపేట శివారులో కూల్చి వేసిన గుడిసెలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కొన్నేండ్లుగా ఇండ్లు లేని పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని, గురువారం కొందరు దాడి చేసి గుడిసెలను కూల్చివేశారని పేర్కొన్నారు. గిరిజన మహిళలను దుర్భాషలాడారని పేర్కొన్నారు. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అక్రమ పట్టాలను రద్దు చేయాలని, పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంకె రవి, ప్రకాష్, చందు, రంజిత్‌కుమార్, మోహన్, మహేష్, అభినవ్, రవి, కరీమా, ఉమారాణి, సమ్మక్క, సరిత, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



కూల్చివేసిన గుడిసెలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు